

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 202 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం, 22, జూన్ 2026 | పేజీలు 4 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# అవినీతి సంపాదనకు.. ఆద్యులెవరు?






● కులాల ముసుగులో అవినీతికి పాల్పడే వాళ్ళు.. ● అధికార పదవులను అడ్డం పెట్టుకొని అవినీతి చేసే వాళ్ళు... ● రాజకీయ పదవులను అడ్డం పెట్టుకొని ప్రజాధనాన్ని దోచుకునే వాళ్ళు... ● వ్యాపారాలతో వేల కోట్లు దోచుకునే వాళ్ళు.. ● బ్యాంకులలో రుణాలు పొందుకొని ఎగ్గొట్టే వాళ్ళు ● ఫైనాన్స్ దందా నడిపే వాళ్ళు ● అధికారికంగా ప్రభుత్వ ఖజానాలను లూటీ చేసే వాళ్ళు.. ● ప్రభుత్వ ధనాన్ని పక్కదారి పట్టించి మాయం చేసే వాళ్ళు... ● ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జాలు చేస్తూ సంపాదించే వాళ్ళు... ● ప్రైవేట్ సంస్థల పేరు మీద వేలకోట్ల రూపాయలు వసూళ్లు చేసే వాళ్ళు... ● బడా మీడియా ముసుగులోబ్లాక్ మెయిల్ చేసి సంపాదించే వాళ్ళు... ● చిట్ ఫండ్స్ కంపెనీల పేర్లతో కస్టమర్లను మోసగించి సంపాదించే వాళ్ళు.... ● పెద్ద ఎత్తున వడ్డీలకు డబ్బులు ఇస్తూ వ్యాపారాలకు పాల్పడే వాళ్ళు... ● డాక్టర్ బరిగెల శివ




డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

అవినీతి సొమ్మును సంపాదించుకోవడం కోసం సులభతనమైన మార్గాలను ఎంచుకుంటున్న వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని డాక్టర్ బరిగెల శివ అన్నారు.దేశంలో పెరిగిపోతున్న అవినీతిని అరికట్టడం ఎవరితరం కాకపోవడం గమనిస్తుంటే అవినీతి సంపాదకుల సంఖ్య లెక్క లేనంతగా పెరిగిపోతుండడం దానికి తోడుగా అక్రమంగా ఆస్తులు సంపాదించుకుంటున్న వ్యక్తులు సమాజాన్ని శాసిస్తుండడం ఆనవాయితీగా మారుతున్న తరుణంలో అవినీతి ఆరంభం అవినీతి మధ్యస్థం అవినీతి అంతం వీటన్నిటిపై దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఆందోళనలు చెందుతున్నప్పటికీ అవినీతిపరుల ఆస్తుల లెక్కలను పసిగట్టడం అవినీతిపరుల లెక్కలు తేల్చే ప్రభుత్వ ఉన్నత అధికారుల వల్ల కూడా కాలేకపోతుండడం గమనార్హమన్నారు.అవినీతితో సంపాదించుకుంటున్న సొమ్మును వివిధ రూపాల్లో మార్చుకుంటూ అవినీతి చేస్తున్న ఆనవాళ్లను దొరకనివ్వకుండా చేసుకోవడం అవినీతిపరుల హక్కుగా మారిపోతుందన్నారు.బ్యాంకుల రుణాలను దోచుకుంటున్న

- మిగతా 2లో..




## మరింత తీవ్రంగా దాడి చేస్తాం..

ఇరాన్ కు ట్రంప్ మరోసారి వార్నింగ్

లెబనాన్‌లోని అనుకూల గ్రూపులను అదుపు చేయాలని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

లేదంటే గత వారం కంటే తీవ్రమైన దాడులు తప్పవని స్పష్టం

ఇరు దేశాల మధ్య స్విట్జర్లాండ్‌లో చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం

చర్చల్లో ఇరాన్ అణు కార్యక్రమం, కాల్పుల విరమణపై దృష్టి

ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య ఘర్షణలతో ఒప్పందం అమలులో సవాళ్లు

2



## కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు

డ్రైవర్ అప్రమత్తతో 41 మంది సేఫ్

కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా దగ్ధమైన ఎలక్ట్రిక్ బస్సు

షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని అంచనా

డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా బయటపడ్డ 41 మంది ప్రయాణికులు

నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా ం కాలిపోయిన బస్సు



4

## మెట్రో పెండింగ్ సమస్యలు

కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ


రైల్వే మంత్రితో భేటీకి ఏర్పాట్లు చేయాలని కిషన్ రెడ్డికి విజ్ఞప్తి

అధికారులు, పత్రాలతో సమావేశానికి హాజరవుతానని వెల్లడి

జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి

2





Subjects shown as backlog papers

| Sno | Subject | Date | Time | Remarks |
|---|---|---|---|---|
| 1 | Business Law | 23-Jun-26 | 11 AM – 1 PM | |
| 2 | Supply Chain Analytics | 23-Jun-26 | 2:30 PM – 4:30 PM | Same Date & Time? |
| 3 | Portfolio / Investment & Portfolio Management | 23-Jun-26 | 2:30 PM – 4:30 PM | Same Date & Time? |
| 4 | Leadership and Teamwork | 24-Jun-26 | 11 AM – 1 PM | Same Date & Time? |
| 5 | AI/ML Approaches to Decision Making | 24-Jun-26 | 11 AM – 1 PM | Same Date & Time? |
| 6 | Capstone Course | 24-Jun-26 | 2:30 PM – 4:30 PM | |
| 7 | Evidence Based Management | Subject shown in email | Timing as per schedule? | Not found in exam Schedule? |

| Event | Date |
|---|---|
| Offence dates mentioned | 25.10.2025, 13.11.2025, 31.12.2025, 01.01.2026 |
| Judicial remand | 16.05.2026 |
| Supplementary exams missed | 19.05.2026 – 30.05.2026 |
| University email regarding special supplementary exams | 15.06.2026 |
| Last date for supplementary fee | 18.06.2026 |
| Interim bail petition filed | 19.06.2026 |
| Exams begin | 22.06.2026 |

## పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ బెయిల్‌పై కొత్త అనుమానాలు

పరీక్షల పేరుతో బెయిల్ పొందడంపై ప్రశ్నలు..

టైమ్ టేబుల్‌లో అవకతవకల ఆరోపణలు

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# సీకేఎం కళాశాలలో ప్రశాంతంగా ముగిసిన నీట్--2026 పరీక్ష





**వరంగల్, 21 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లాలోని సీకేఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన నీట్--2026 (జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష) ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ డా. సత్య శారద తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షకు మొత్తం 480 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వారిలో 431 మంది హాజరయ్యారని, 49 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. నీట్ పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు తాగునీరు, వైద్య సదుపాయం, భద్రత తదితర అవసరమైన సౌకర్యాలను కల్పించినట్లు వెల్లడించారు. పరీక్షా నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ పారదర్శకంగా పరీక్షను నిర్వహించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడంతో పరీక్ష ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా పూర్తైందన్నారు. పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది సహా సంబంధిత శాఖల ప్రతినిధుల కృషిని జిల్లా కలెక్టర్ అభినందించారు.

# కుడా ప్లాట్లు, ఫ్లాట్ల వేలానికి విశేష స్పందన



**హన్మకొండ, 21 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రం ప్రాంతంలోని కమర్షియల్ ప్లాట్లు, అంబేద్కర్ భవన్ సమీపంలోని రెసిడెన్షియల్ ఫ్లాట్ల బహిరంగ వేలం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. కుడా వైస్ చైర్మన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సమక్షంలో జరిగిన ఈ వేలంపాటలకు బిడ్డర్ల నుంచి విశేష స్పందన లభించింది. బాలసముద్రం ప్రాంతంలో ఉన్న ఎనిమిది కమర్షియల్ ప్లాట్లను వేలానికి ఉంచగా, వాటిలో ఆరు ప్లాట్లు విక్రయమయ్యాయి. గజానికి కనీస ధర రూ.50 వేలుగా నిర్ణయించగా, బిడ్డర్ల పోటీతో ధరలు గణనీయంగా పెరిగి గజానికి కనిష్టంగా రూ.66 వేల నుంచి గరిష్టంగా రూ.97 వేల వరకు పలికాయి. అదేవిధంగా అంబేద్కర్ భవన్ సమీపంలో కుడా ఆధీనంలోని మూడు రెసిడెన్షియల్ ఫ్లాట్లను వేలానికి ఉంచగా, వాటిలో రెండు ఫ్లాట్లు విక్రయమయ్యాయి. చదరపు అడుగుకు రూ.4,200 చొప్పున బిడ్డర్లు కొనుగోలు చేశారు. వేలంపాటలో పాల్గొన్న బిడ్డర్లు ముందస్తుగా నిర్ణయించిన ఈఎండీ చెల్లించి పోటీపడ్డారు. నిబంధనలకు అనుగుణంగా, పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించిన ఈ వేలం ద్వారా కుడాకు గణనీయమైన ఆదాయం సమకూరనున్నట్లు అధికారులు తెలిపారు. వేలంలో ప్లాట్లు, ఫ్లాట్లు దక్కించుకున్న బిడ్డర్లకు కుడా వైస్ చైర్మన్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కేటాయింపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుడా అభివృద్ధి చేసిన ప్లాట్లు, ఫ్లాట్లపై ప్రజలు చూపుతున్న విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణాభివృద్ధికి అవసరమైన వనరుల సమీకరణతో పాటు ప్రజలకు మెరుగైన పెట్టుబడి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఇటువంటి వేలంపాటలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కుడా చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రణాళికాబద్ధమైన లేఅవుట్లు, నగర విస్తరణ అవకాశాల కారణంగా కుడా ఆస్తులకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని ఆమె అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరిన్ని నాణ్యమైన పట్టణాభివృద్ధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి అజిత్ రెడ్డి, కుడా అధికారులు, సిబ్బంది, బిడ్డర్లు తదితరులు పాల్గొన్నారు.



# అవినీతి సంపాదనకు ఆద్యులెవరు

మొదటి పేజీ తరువాయి


వ్యాపారస్తులు సునాయసమైన మార్గంలో అధికారికంగా వేల కోట్ల రూపాయలను రుణంగా తీసుకొని వ్యాపారాలలో నష్టాలను చూపిస్తూ బ్యాంకుల రుణాలను ఎగ్గొడుతుండటమే కాకుండా ప్రభుత్వాల మద్దతుతో బ్యాంకుల రుణాలను మాఫీ చేయించుకుంటున్నారని ఈ విధంగా ప్రతి రాష్ట్రంలో కొన్ని వేల కోట్ల రూపాయలు ప్రజాధనం వ్యాపారుల చేతుల్లోనికి వెళుతుండగా కొన్ని లక్షల కోట్ల రూపాయలు దేశవ్యాప్తంగా ఇదే పద్ధతిలో వ్యాపారస్తులు బ్యాంకులను ప్రభుత్వాలను మోసగిస్తూ బ్యాంకుల ద్వారా తీసుకుంటున్న రుణాల నుండి ఉపశమనం పొందుతున్నారని నిలదీశారు.మరి ప్రాముఖ్యంగా ప్రతి రాష్ట్రంలో కొనసాగించబడుతున్న ప్రైవేట్ సంస్థలు వాటి స్థాయికి మించి అక్రమ పైసల వసూళ్లకు పాల్పడుతున్నారని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నప్పటికీ ప్రతి రాష్ట్రంలో అనధికార హోదాలో కొనసాగుతున్న ట్రస్టులు ప్రైవేట్ సంస్థలు ప్రైవేట్ వ్యాపారాలు ప్రజలను మోసగించడమే కాకుండా రాష్ట్ర పరిధిలో ఇతర రాష్ట్రాల పరిధిలో దేశవ్యాప్తంగా ప్రపంచవ్యాప్తంగా సంస్థల పేరు చెబుతూ అక్రమంగా వసూళ్లకు పాల్పడుతూ వేలకోట్ల రూపాయలను పోగు చేసుకుంటున్నారని అలాంటివన్నీ చట్టానికి విరుద్ధంగా పైసలు వసూలు చేయడం నేరమని తెలిసినప్పటికిని అక్రమంగా డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేట్ సంస్థలు ఆగడాలపై మాత్రం ఏ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వికారంగా ఉందన్నారు.ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న సంస్థలకు కూడా డబ్బులు పోగు చేసుకునే చట్టం లేనప్పుడు ప్రైవేట్ సంస్థలు వేలకోట్ల రూపాయలు పోగు చేయడం ప్రభుత్వాల కండ్లకు ఎందుకు కనిపించడం లేదని నిలదీశారు.సాధారణ ప్రజలు పూరి గుడిసెలో జీవిస్తున్న ఇంటి పన్ను నల్ల పన్ను గుడిసె పన్నులు వసూలు చేసే జబర్దస్త్ ప్రదర్శిస్తున్న ప్రభుత్వాలు సాధారణ ప్రజలు జీవనోపాధి కోసం ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే బలవంతంగా పీకేయిస్తూ బలవంతంగా కూల్చివేస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్న ప్రభుత్వాలు వేలకోట్ల రూపాయలను అక్రమ పద్ధతిలో వసూళ్లకు పాల్పడుతున్న సంస్థల పైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ సూటిగా నిలదీశారు.ప్రతి ప్రభుత్వ సంస్థ ఐనా ప్రైవేట్ సంస్థ ఐనా వాళ్లు సంపాదించుకుంటున్న లావాదేవీలలో తప్పకుండా ప్రభుత్వానికి ఇన్కమ్ టాక్స్ రూపంలో డబ్బులు చెల్లిస్తూ ఆదాయాలకు సంబంధించిన డబ్బులకు లెక్కలు చూపించకుండా వాటికి పన్నులు చెల్లించాల్సి ఉంటుండగా ప్రైవేట్ వ్యాపారాలు ప్రైవేట్ సంస్థలు నడుపుతున్న వ్యక్తులు ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతుండడం భరించరాని మోసం లాంటిదని గుర్తు చేశారు.చట్టం సర్వ మానవాళికి సమానమైన పద్ధతిలో ఉంటుండగా ప్రైవేట్ వ్యాపారస్తులకు ఒకరకమైన చట్టం ప్రైవేట్ సంస్థలను నడిపిస్తున్న పెద్ద మనుషులకు మరో రకమైన చట్టం సామాన్యులకు కఠినమైన చట్టాలను వర్తింపజేయడం ప్రభుత్వాలకు తగునా అంటూ సూటిగా అడిగారు.తప్పు చేస్తున్న వ్యక్తులను దండించడం ప్రభుత్వాలు ఎంతటి చర్యలనైతే కనపరుస్తున్నారో అలాంటి చర్యలనే ప్రైవేట్ సంస్థలు నడిపిస్తూ వేలకోట్ల రూపాయలు వసూళ్లకు పాల్పడుతూ వ్యక్తిగత ఖాతాలలో వేసుకుంటున్న వ్యక్తులు శక్తులు సమాజ వ్యతిరేకులు సంఘవిద్రోహ శక్తులను కాపాడుతున్నది ఎవరు అంటూ సూటిగా నిలదీశారు. పెద్ద మొత్తంలో సంపాదించబడుతున్న అవినీతి అక్రమాస్తులపై చర్యలు తీసుకునే క్రమంలో లెక్కలలోనికి ఎందుకు రావంటూ సూటిగా ప్రశ్నించారు.ప్రభుత్వాలను మోసగిస్తూ ప్రభుత్వ యంత్రాంగాలను మోసగిస్తూ కొంతమంది పెద్ద స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ ఉద్యోగాల ద్వారా వస్తున్న జీతాల కన్నా వ్యాపారాలతో సంపాదించుకునే సంపాదనకే ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారని అలా ఉద్యోగాలు చేస్తూ ప్రైవేట్ స్థిరాస్తులు కూడబెట్టుకునే వ్యక్తులను గుర్తించాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వ కార్యాలయాలు అధికారులదేనని గుర్తు చేశారు.దేశం మొత్తంలో ఆర్ఎస్ఎస్ సంస్థ ప్రైవేట్ వ్యాపారాన్ని నడిపిస్తూ వేలకోట్ల రూపాయల సంపదను డొనేషన్స్ రూపంలో లెక్కలేనంత డబ్బును వసూలు చేస్తూ వంద సంవత్సరాల చరిత్ర కలిగిఉందని ప్రభుత్వాలకు పన్నులు చెల్లించకపోవడం ప్రపంచ చరిత్రలో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతూ ప్రభుత్వాలకు ఇన్కమ్ టాక్స్ లు చెల్లించని ఏకైక సంస్థ ఏదైనా ఉందంటే అది ఆర్ఎస్ఎస్ మాత్రమేనని గుర్తింపు పొందుతున్నట్లుగా సూటిగా స్పష్టంగా నిలదీశారు.దానితోపాటు ఆర్ఎస్ఎస్ సంస్థలో పనిచేస్తున్న వేలాది లక్షలాది ప్రభుత్వ ఉద్యోగులు వాళ్లకు సంబంధించిన వ్యక్తిగత అకౌంట్స్ తో పాటు కుటుంబ సభ్యులు బంధువులు బినామీదారుల అకౌంట్స్ లలోకి ఆర్ఎస్ఎస్ పేరు మీద వసూళ్లకు పాల్పడుతున్న ఫండింగ్ డబ్బులను జమచేసుకొని అవినీతి అక్రమ సంపాదకులుగా వెలుగొందుతున్నారని వాళ్ళందరిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వ సంస్థలలోని ఉన్నత అధికారులతో పాటు ప్రభుత్వాలపై ఉంటుందన్నది స్పష్టంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.అలా ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ దగుల్బాజీగా,దర్జాగా అక్రమ డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులను పోలీస్ చట్టాల ఆధారంగా న్యాయస్థానాల చట్టాల ఆధారంగా ఏమంటారో ప్రభుత్వ ఉన్నత అధికారులు గుర్తించకపోవడం వికారంగా ఉందన్నారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి ఆయా ప్రభుత్వ కార్యాలయాల నియమ నిబంధనలతో పాటు ప్రభుత్వం విధిస్తున్న నియమాలు పక్కాగా అమలవుతాయన్న సంగతిని మరిచిపోయి అవినీతి ఆస్తులు సంపాదిస్తూ అక్రమ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న ఉద్యోగులు అధికారులు ఆర్ఎస్ఎస్ పేరు చెప్పుకొని డబ్బులు జమ చేయడం ఘోరమైన నేరంగా పరిగణించకపోతే సమాజాన్ని భ్రష్టు పట్టించి భారత రాజ్యాంగాన్ని తుప్పుపట్టించి పోలీస్ వ్యవస్థలను బోల్తా కొట్టించి అవినీతికి పాల్పడుతున్న సొమ్ముల లెక్కలను బయట పెట్టకుండా రహస్యంగా భద్రపరచుకోవడంతోపాటు ఆస్తుల రూపంలో భూముల రూపంలో ఫ్లాట్ల రూపంలో భవనాల రూపంలో కొనుగోలు చేసుకుంటూ ఆదాయానికి మించిన ఆస్తిదారులుగా సమాజంలో చెలామని చేస్తుండడమే కాకుండా దర్జాగా తిరుగుతున్నారని హెచ్చరించారు.

### అవినీతి సంపన్నులపై చర్యలెక్కడ..

ఎంత సంపాదిస్తే అంత దాచుకోవాలని ఎన్ని ఆస్తులు పోగు చేసుకుంటే వాటిని కనబడనివ్వకుండా పెట్టుకోవాలని అవినీతి ఆస్తిదారులు అవినీతి సంపాదకులు తెగ ఉబలాట పడుతుండగా ప్రజలను మోసగించి ప్రజాసంస్థలను మోసగించి ప్రభుత్వ కార్యాలయాలను మోసగించి బ్యాంకులను మోసగించి సంపాదించుకున్న సొమ్మంతా సమాజానికి ప్రజలకు ప్రభుత్వాలకు ఇంకా చెప్పాల్సి వస్తే కుటుంబ సభ్యులకు బంధువులకు కూడా తెలియనంత రహస్యంగా అవినీతి సొమ్మును పోగు చేసుకుంటున్న విషయం ఎంతటి భయంకరమైన మోసమో అడ్డదారిలో అవినీతి మార్గాలను ఎంచుకొని అక్రమ పద్ధతిలో అవినీతి సొమ్మును పోగు చేసుకుంటున్నా ప్రతి ఒక్కరూ గమనించాల్సిన విషయం ఉందన్నారు.అవినీతి అనేది ఒక రోజుతో పోయే మచ్చ కాదని మనిషి బ్రతికిన మనిషి చనిపోయిన తరం మొత్తం అనుభవించే బహిరంగ నేరమని దానిని గమనించకుండా అధికారం ఉంది కదా అని పలుకుబడి ఉంది కదా అని ప్రభుత్వ హోదాలో కొంత రాజకీయ అధికార పదవులలో కొంత వ్యాపార హోదాలో కొంత భూకబ్జాలకు మోజులో మరింత అవినీతికి పాల్పడుతూ చట్టాలను న్యాయస్థానాలను వ్యతిరేకిస్తూ ఇష్టానుసారంగా దోచుకునే వ్యక్తుల పరిస్థితి ప్రస్తుతం మెరుగ్గానే ఉండొచ్చు కానీ కాలక్రమేనా అవినీతి సొమ్ము అవినీతి లెక్కలు అక్రమ సంపాదన బయటపడుతున్న రోజున కుటుంబాలే కాదు తరాలు కూడా బజారున పడాల్సి వస్తుందన్న సంగతిని మర్చిపోకూడదని హెచ్చరించారు.న్యాయస్థానాలను గాని చట్టాలను గాని ప్రభుత్వ వ్యవస్థలను గాని ఎక్కువగా వ్యతిరేకిస్తూ ఎక్కువగా మోసగిస్తూ ఎక్కువగా తప్పుదారి పట్టిస్తూ నడుస్తున్న వ్యక్తులందరూ అవినీతి సంపాదకులేనని గుర్తుంచుకోవాలన్నారు.రాజకీయపరంగా ప్రస్తావించాల్సి వచ్చినప్పుడు భారతదేశంలో పార్లమెంటు సభ్యుడు పొందుకునే లావాదేవీలు లెక్కకు మించిన స్థాయికి మించిన ఉంటున్నాయి అన్నారు.ప్రాథమిక జీతం 1,24,000 నుండి 1,50,000 వరకు ఉంటుండగా విదేశీ విమాన ప్రయాణాలు సంవత్సరానికి గాను 34 ఉచితంగా పొందుకొని అవకాశం లభించబడిందన్నారు.ఫస్ట్ క్లాస్ రైల్ ప్రయాణం పదవిలో కొనసాగినంత కాలం ఉచితంగానే ఉంటుందని తెలిపారు.ఉచిత విద్యుత్ సంవత్సరానికి 50వేల యూనిట్లు,ఉచిత నీటి సరఫరా సంవత్సరానికి 4,000 కిలో మీటర్లు,కార్యాలయాల భత్యం నెలకు 62,000,నివాసభత్యం నెలకు 20,00,000,పెన్షన్ అర్హత నెలకు 31 వేల రూపాయలు ఇలా సంపన్నమైన హోదాను,పరిపూర్ణమైన సౌకర్యాలను కల్పిస్తూ రాజకీయ హోదాను ప్రసాదించిన ప్రజలను నడ్డి విరిచి మోసగించి రాజకీయ నాయకులు సంపాదిస్తున్న అవినీతి సంపాదన దేశంలో ఎవరూ గుర్తించలేకపోతున్నారని విమర్శించారు.ఇంచుమించు అసెంబ్లీ సభ్యులకు అలాంటి సౌకర్యాలే కల్పించబడుతూ జీతభత్యాలు మాత్రం పుష్కలంగా ఉంటుండగా వీటన్నిటిని పక్కనపెట్టి కాంట్రాక్టుల రూపంలో ప్రభుత్వాల నుండి నిధులు తెప్పించుకుంటూ లెక్కలేనంత అవినీతి సొమ్మును సంపాదిస్తున్నారని ప్రజాసేవ అనే పదాన్ని ఆమడ దూరాన పెట్టి పైస సంపాదన అనే పదంలోపల జీవిస్తూ రాజకీయ పదవిని వ్యాపార పదవిగా మార్చుకొని స్థాయికి మించిన సంపాదనను పోగు చేసుకుంటున్నారని హెచ్చరించారు.

### వడ్డీ వ్యాపారం చెడ్డ మోసం..

తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా వడ్డీ వ్యాపారాల దందా విపరీతంగా పెరిగిపోతుందని డబ్బులు అవసరం ఉన్న వ్యక్తులకు ఐదు చొప్పున 10 చొప్పున 15 చొప్పున వడ్డీలకు డబ్బులు ఇస్తూ డబ్బులు తిరిగి చెల్లించని వ్యక్తులపై గ్యాంగులతో గ్రూపులతో అసాంఘిక శక్తులతో దాడులు చేయిస్తూ వడ్డీతో సహా, చక్రవడ్డీతో సహా, భూ చక్ర వడ్డీతో సహా ,ధర్మ చక్రవడితో సహా కలిపి ఆయా వ్యక్తులకు కలిగిన స్థిరాస్తులను బాండ్ పేపర్ల రూపంలో రాయించుకుంటున్నారని తీవ్రంగా మందలించారు.అవినీతిపరంగా అక్రమంగా సంపాదించుకున్న డబ్బులను వ్యాపారాలకు గిరిగిరిలకు కేటాయిస్తూ పైసా వ్యాపారమే ప్రాణంగా బతుకుతున్న వ్యక్తులు లేకపోలేదని హెచ్చరించారు.చిన్న చిన్న వ్యాపారాలతో చిన్నచిన్న చిట్టీలతో ఎలాంటి అభ్యంతరాలు లేవు గాని వడ్డీ రూపాలలో పైసలిస్తూ పైసలు చెల్లించని వ్యక్తుల మీద కిరాతకంగా దాడులు చేస్తూ నానా బూతులు తిడుతూ గిరిగిరి ఫైనాన్స్ దందాలు నడుపుతున్న వడ్డీ వ్యాపారాలు నడుపుతున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని హెచ్చరించారు.కొంతమంది సాధారణ చిట్టీలు నడుపుతున్న సందర్భాల్లో ప్రధాన సమస్యల్లో ఉన్న వ్యక్తులను సొంత డబ్బులతో ఆదుకుంటూ వాళ్ళ ఉదారతను చాటుకుంటున్నారని సకాలంలో డబ్బులు చెల్లించిన డబ్బులు చెల్లించకపోయిన మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ కష్టకాలంలో ఉన్న వ్యక్తులను ఆదుకుంటున్నారని అలాంటి వాళ్ళతో ఎలాంటి సమస్య లేదు గానీ ఈ మధ్యకాలంలో ఎక్కువగా వడ్డీ వ్యాపారం రూపంలో డబ్బులు ఇస్తూ ప్రామిసరీ నోట్స్ చెక్కు్లు తీసుకుంటూ సకాలంలో డబ్బులు చెల్లించని వ్యక్తులపై చదువుకుంటున్న విద్యార్థులను చదువులు మానేసి తిరుగుతున్న యువతను రాజకీయ నాయకుల దగ్గర తిరుగుతున్న ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులను ఉసిగొలుపుతూ డబ్బుల చెల్లింపులపై సామాన్య వ్యక్తుల ప్రాణాలను తోడేస్తున్నారని వారందరిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలుగు రాష్ట్రాలలోని పోలీసు వ్యవస్థను కోరినారు.ప్రైవేట్ కళాశాలల నిర్మాణాలకు ప్రైవేట్ సంస్థల ఏర్పాటు కోసం వ్యాపార సంస్థల నిర్మాణాల కోసం పెద్ద ఎత్తున డబ్బులు అప్పుగా ఇస్తూ వడ్డీ వ్యాపారం చేస్తున్న వ్యక్తులందరూ సమాజాన్ని మోసం చేసే వ్యక్తులుగా గుర్తించాల్సి వస్తున్న సందర్భాలలో అలాంటి వక్తులను ప్రతి ఒక్కరి ఆగడాలను బయటపెడుతూ ప్రభుత్వాలే ఇలాంటి క్రూరమైన క్రియలను నిర్మూలించాలని కోరారు.మొత్తం మీదుగా అవినీతి సంపాదకులు అవినీతికి ఆద్యం పోస్తూ మమ్మల్ని ఎవరు పసిగట్టలేరు అనుకోవడం అధికారం ఉన్నంతవరకే నన్న సంగతిని మర్చిపోయి ప్రవర్తిస్తే సమయం బెడిసి కొట్టిన రోజు సంపాదించిన ఆస్తులతో పాటు ఉన్న ఆస్తులు కూడా పోగొట్టుకోవాల్సి వస్తుందని సంగతిని మర్చిపోవద్దన్నారు.



# మరింత తీవ్రంగా దాడి చేస్తాం..

**అమెరికా, జై భీమ్ న్యూస్**

ఒకవైపు అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో కీలక చర్చలు జరుగుతుండగానే, మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. లెబనాన్‌లోని ఇరాన్ అనుకూల గ్రూపుల కార్యకలాపాలను తక్షణం నిలిపివేయాలని, లేదంటే గత వారం కంటే మరింత తీవ్రమైన సైనిక చర్య తప్పదని ఆదివారం స్పష్టం చేశారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "లెబనాన్‌లో ఇబ్బందులు సృష్టిస్తున్న తమ ప్రాక్సీ గ్రూపులను ఇరాన్ వెంటనే ఆపాలి. అలా చేయని పక్షంలో, మేం గత వారం కంటే ఈసారి చాలా గట్టిగా ఇరాన్‌పై దాడి చేస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ అణు కార్యక్రమం, ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలు, లెబనాన్ సహా ఇతర ప్రాంతీయ భద్రతా అంశాలపై చర్చించేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్విట్జర్లాండ్‌కు చేరుకున్న సమయంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇరు దేశాల మధ్య ఈ నెల ప్రారంభంలో ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. అణు అంశాలు, హోర్ముజ్ జలసంధి, లెబనాన్‌తో సహా పలు ప్రాంతాల్లో కాల్పుల విరమణపై 60 రోజుల పాటు చర్చలు జరపాలని ఇందులో నిర్ణయించారు. అయితే, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దళాలు, హిజ్బుల్లా మధ్య మళ్లీ ఘర్షణలు చెలరేగడంతో స్విస్ చర్చలు ఆలస్యమయ్యాయి. లెబనాన్‌లో కాల్పుల విరమణను కాపాడే ప్రయత్నాలపై ఉపాధ్యక్షుడు వాన్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి ఒప్పందాల అమలులో కొన్ని ఇబ్బందులు సహజమేనని, పరిస్థితి సున్నితంగా ఉందని అంగీకరించారు. అధ్యక్షుడు ట్రంప్ తమకు పూర్తి అధికారాలు ఇచ్చారని వెల్లడించారు. ఇరాన్ అణ్వాయుధాలపై ఆశలు వదులుకుంటేనే అమెరికాతో సత్సంబంధాలు ఏర్పడతాయని స్పష్టం చేశారు. శాశ్వత కాల్పుల విరమణకు ట్రంప్ కట్టుబడి ఉన్నారని వాన్స్ ఉద్ఘాటించారు. కాగా, ట్రంప్ తాజా హెచ్చరికలపై ఇరాన్ నుంచి తక్షణమే ఎలాంటి స్పందన రాలేదు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆకట్టుకున్న ఆర్బిట్ ఇ-టెక్నో విద్యార్థులు

**యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం - వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్**

**హనుమకొండ, 21 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించిన యోగా ఉత్సవ కార్యక్రమంలో ఆర్బిట్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు తమ అద్భుత యోగా ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షించి ప్రశంసలు అందుకున్నారు. యోగా పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామ విధానాలు, శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను పెంపొందించే యోగా ప్రక్రియలను అద్భుతంగా ప్రదర్శించారు. చిన్నారులు చూపిన ఏకాగ్రత, క్రమశిక్షణ, సమన్వయం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెరుగుతాయని విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా చాటిచెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అపూర్వమైన వరమని పేర్కొన్నారు. నేటి ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం పొందేందుకు యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్య వంతమైన శరీరంతో పాటు ప్రశాంతమైన మనస్సును పొందగలరని వివరించారు.



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ విద్యార్థుల యోగా ప్రదర్శనలను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమని ఆయన అన్నారు. యువత ఆరోగ్యవంతంగా, క్రమశిక్షణతో ఎదగాలంటే యోగా సాధనను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్బిట్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రత్యేక ఫొటో సెషన్‌లో పాల్గొని వారిని ప్రోత్సహించారు. విద్యార్థుల ప్రతిభ, క్రమశిక్షణ, యోగా పట్ల ఉన్న అంకితభావాన్ని కొనియాడిన సీపీ సన్‌ప్రీత్ సింగ్, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన ప్రోత్సాహకరమైన మాటలు విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట డివిజన్ ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్, పాఠశాల యాజమాన్యం భగవాన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా యోగా యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు చేరవేయడంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలనే సందేశాన్ని అందించారు. ఆర్బిట్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థుల ప్రతిభావంతమైన యోగా ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి హాజరైన వారందరి ప్రశంసలు అందుకున్నాయి.

## పాత్‌ఫైండర్ పాఠశాలలో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు




**ఐనవోలు: (జై భీమ్ న్యూస్)**

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆదివారం పాత్‌ఫైండర్ హై స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. లయన్ . ఎన్. వెంకటేశ్వరరావు విచ్చేసి యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. యోగా శారీరక దృఢత్వాన్ని, మానసిక ప్రశాంతతను, ఏకాగ్రతను పెంపొందించే గొప్ప సాధనమని, ప్రతి విద్యార్థి ప్రతిరోజూ యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు ప్రదర్శించి తమ ప్రతిభను కనబరిచారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి యోగాలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. సుభానుద్దీన్.... మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వికాసానికి యోగా ఎంతో అవసరమని, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి ప్రతిరోజూ యోగా చేయాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరగా యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని అందరూ ప్రతిజ్ఞ చేశారు.

# మెట్రో పెండింగ్ సమస్యలు

**కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ**
**రైల్వే మంత్రితో భేటీకి ఏర్పాట్లు చేయాలని కిషన్ రెడ్డికి విజ్ఞప్తి**
**అధికారులు, పత్రాలతో సమావేశానికి హాజరవుతానని వెల్లడి**
**జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీ పర్యటనలో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాలతో వస్తానని, అధికారులతో కలిసి సమావేశానికి హాజరవుతానని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా మెట్రో మొదటి దశకు సంబంధించిన ఐఆర్ఎఫ్‌సీ (ఐఆర్ఎఫ్‌సీ) నిధుల విడుదల, రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులపై చర్చించాల్సి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు.

# సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ

**వరంగల్, జూన్ 21 (జై భీమ్ న్యూస్)**



జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించను న్నట్లు జిల్లా కలెక్టర్ డా. సత్య శారద తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు ప్రజావాణి కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయి సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి, డివిజన్ స్థాయి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణికి ప్రజలు హాజరై తమ వినతులు, దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతారని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణి ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పిలుపునిచ్చారు.

# శ్మశానవాటికలో పేకాట.. నాగారంలో జూదం

## హసన్‌పర్తి పోలీసుల వరుస దాడులు.. 12 మంది అరెస్ట్

**హసన్‌పర్తి, 21 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలంలో అక్రమ పేకాట స్థావరాలపై పోలీసులు నిర్వహించిన వరుస దాడుల్లో 12 మంది జూదరులను అరెస్ట్ చేశారు. రెండు వేర్వేరు ఘటనల్లో నగదు, బైక్‌లు, మొబైల్ ఫోన్లు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హసన్‌పర్తి గ్రామ శ్మశానవాటిక వద్ద డబ్బులు పందెంగా పెట్టుకుని పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు ఆదివారం మధ్యాహ్నం మెరుపు దాడి నిర్వహించారు. పోలీసులను గమనించిన నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించగా, ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారైనట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.2 వేల నగదు, నాలుగు మోటార్ సైకిళ్లు, 52 పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో నాగారం గ్రామంలోని గాంధీ విగ్రహం సమీపంలో డబ్బులతో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.800 నగదు, మూడు మొబైల్ ఫోన్లు, 52 పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అక్రమ జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్, ఎస్ఐ ఎస్. రవి హెచ్చరించారు. మండలంలో పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## యోగా దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వరంగల్ పోలీసుల వినూత్న కార్యక్రమం



**వరంగల్, 21 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ మైదానంలో చేపట్టిన వినూత్న హరిత కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదనపు డీసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న విశాల భారతదేశ పటం పచ్చని మొక్కలతో కళకళలాడుతూ దేశభక్తి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలకు ప్రతీకగా నిలుస్తోంది. వరంగల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వేలాది మొక్కలతో రూపుదిద్దుకుంటున్న ఈ విశాల భారత పటం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా మారింది. యోగా కార్యక్రమాలను డ్రోన్ కెమెరా ద్వారా చిత్రీకరించిన సందర్భంగా ఆకాశం నుంచి వీక్షించిన భారతదేశ పటం అద్భుతంగా కనిపించింది. పచ్చని మొక్కలతో రూపొందించిన భారతదేశ ఆకృతి స్పష్టంగా దర్శనమిస్తూ దేశ సమైక్యత, సాంస్కృతిక వైవిధ్యం, జాతీయ గౌరవాన్ని ప్రతిబింబించింది. డ్రోన్ దృశ్యాల్లో భారతదేశ పటం ఆవిష్కృతమైన తీరు కార్యక్రమానికి హాజరైన వారిని మాత్రమే కాకుండా సామాజిక మాధ్యమాల్లో వీక్షించిన ప్రజలను సైతం విశేషంగా ఆకట్టుకుంది. దేశభక్తి భావనతో పాటు పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ఒకే వేదికపై ప్రజలకు చేరవేసేలా రూపొందించిన ఈ వినూత్న ఆలోచనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ పరేడ్ మైదానాన్ని సందర్శించి రూపొందిస్తున్న భారతదేశ పటం విశేషాలను అదనపు డీసీపీ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. పటం నిర్మాణ లక్ష్యం, మొక్కల పెంపకం, నిర్వహణ, భవిష్యత్తులో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను ఆసక్తిగా తెలుసుకుని పోలీస్ అధికారులను అభినందించారు. పోలీస్ శాఖ కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణ, హరితహారం, సామాజిక చైతన్యం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లోనూ ముందంజలో ఉంటుందనే విషయాన్ని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. హరిత తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టిన ఈ విశాల భారత పటం భవిష్యత్తులో వరంగల్ నగరానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. వేలాది మొక్కలతో అభివృద్ధి చేస్తున్న ఈ హరిత భారత పటం దేశభక్తికి ప్రతీకగా, పర్యావరణ పరిరక్షణకు స్ఫూర్తిగా, భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు దేశభక్తి భావనను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డ్రోన్ చిత్రాల్లో ఆవిష్కృతమైన ఈ విశాల భారత పటం కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకువచ్చిందని, ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వెల్లడించారు. "పచ్చదనం -- దేశభక్తి -- క్రమశిక్షణ" అనే మూడు విలువలను ప్రతిబింబిస్తున్న ఈ విశాల భారతదేశ పటం వరంగల్ పోలీసుల సామాజిక బాధ్యత, పర్యావరణ నిబద్ధత, జాతీయ స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. భవిష్యత్తులో ఈ హరిత భారత పటం వరంగల్ నగరంలో ఒక ప్రముఖ ఆకర్షణగా, పర్యావరణ పరిరక్షణకు చిహ్నంగా నిలవనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్షలు

**4,196 మందికి గాను 3,764 మంది హాజరు**
**కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హన్మకొండ, 21 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా విజయవంతంగా ముగిశాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 12 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహించగా, మొత్తం 4,196 మంది అభ్యర్థులకు గాను 3,764 మంది హాజరయ్యారు. కాగా 432 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో ఎంతమంది అభ్యర్థులు హాజరయ్యారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి, అభ్యర్థులకు అందిస్తున్న సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ముందస్తుగానే అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్, రవాణా, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. పోలీసు శాఖ, రెవెన్యూ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖల సమిష్టి కృషితో పరీక్షలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సాఫీగా పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. పరీక్షల విజయవంత నిర్వహణకు సహకరించిన అధికారులు, పోలీసు సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో వేలాది మంది విద్యార్థులు భవిష్యత్ వైద్య విద్య లక్ష్యంగా హాజరైన ఈ కీలక పరీక్ష ప్రశాంతంగా ముగియడం పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# వృద్ధురాలి మెడలోని మూడు తులాల బంగారు గొలుసు అపహరణ

బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగుల కోసం పోలీసుల గాలింపు





**హన్మకొండ, 21 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ నగరంలోని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన గొలుసు చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్బీహెచ్ కాలనీలో నివాసం ఉంటున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును ఇద్దరు దుండగులు అపహరించి పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఎస్బీహెచ్ కాలనీకి చెందిన పుష్పలత (69) ఇంటి సమీపంలో ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను లక్ష్యంగా చేసుకుని మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని వేగంగా అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనతో భయాందోళనకు గురైన బాధితురాలు సుబేదారి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన స్థల పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల కదలికలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్వరలోనే దుండగులను గుర్తించి అరెస్టు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా సుబేదారి ఇన్స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఒంటరిగా సంచరించే సమయంలో అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# కాజీపేటలో మానసిక వికలాంగురాలు అదృశ్యం

**కాజీపేట, 21 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ఓ మానసిక వికలాంగురాలు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, సింగారపు రేవతి (30), దివంగత పాండు కుమార్తె, జూన్ 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. రేవతి సోదరి పోతు రజిత తన చెల్లెలు కనిపించకపోవడంతో బంధువులు, పరిచయస్తుల వద్ద గాలించినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైమ్ నెం. 158/2026 కింద ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన రేవతి ఎత్తు సుమారు 4 అడుగులు ఉండగా, తెలుపు రంగు చర్మం, నుదుటిపై పుట్టుమచ్చ కలిగి ఉంటుంది. ఇంటి నుంచి వెళ్లే సమయంలో బ్లాక్ అండ్ రెడ్ లైన్స్ ఉన్న టాప్, క్రీమ్ కలర్ లెగ్గిన్స్ ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రేవతి ఆచూకీ తెలిసిన వారు వెంటనే 8712583765, 8712685008, 8332090739, 8712685122 నంబర్లకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కాజీపేట పోలీసులు కోరారు.

# కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు

డ్రైవర్ అప్రమత్తతో 41 మంది సేఫ్

కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా దగ్ధమైన ఎలక్ట్రిక్ బస్సు

షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని అంచనా

డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా బయటపడ్డ 41 మంది ప్రయాణికులు

నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా కాలిపోయిన బస్సు

**కరీంనగర్, జై భీమ్ న్యూస్**

కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఇవాళ ఉదయం 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగునూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

# గురువుల సాక్షిగా మళ్లీ ఒక్కటైన నాగారం 2002-03 ఎస్ఎస్సి విద్యార్థులు

కాలం దూరం చేసినా.. స్నేహం దగ్గర చేసింది

**హసన్‌పర్తి, 21 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**




హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం నాగారం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి (ఎస్ఎస్సి) పూర్తి చేసిన విద్యార్థులు 23 సంవత్సరాల అనంతరం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు, సహ విద్యార్థులు, తమ భవిష్యత్తుకు బాటలు వేసిన గురువులను ఒకే వేదికపై కలుసుకోవడంతో కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య భావోద్వేగభరితంగా సాగింది. ఒకప్పుడు ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్న విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడి మళ్లీ కలుసుకోవడం విశేషంగా నిలిచింది. విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలు, ఆటపాటలు, పరీక్షల అనుభవాలు, గురువుల బోధనలు, పాఠశాలలో గడిపిన అమూల్యమైన క్షణాలను గుర్తుచేసుకుంటూ అందరూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా తమ జీవితాలకు దిశానిర్దేశం చేసిన ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి, మల్లారెడ్డి, సత్యం, బుచ్చిరెడ్డి, వీరేశలింగం, సుదర్శన్, సరోజన, శశికళలను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. తమ విజయాలకు గురువులే మూలస్తంభాలని, వారి కృషి ఎప్పటికీ మరువలేమని పూర్వ విద్యార్థులు కృతజ్ఞతాభావంతో పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేందర్, అక్రమ్, రాజులు, సురేష్, రాజేష్, చందర్, రఘుపతి, నాగరాజు, వెంకటేశ్వర్లు, సుమన్, శ్రీనివాస్, రవి, రంజిత్, రాజేష్ ఖన్నా, నవీన్, స్వప్న, కవిత, రజిత, లావణ్య, రాధిక, శారద, జయంతి, స్రవంతి, సంధ్య, సారిక, శైలజ, మమత తదితరులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి, ప్రస్తుత విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యా సహాయం, పేద విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలపై కూడా చర్చించారు. తమకు విద్యను అందించిన పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో అండగా నిలుస్తామని పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనం స్నేహబంధాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా గురు–శిష్య సంబంధాల గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పింది. కాలం ఎంత దూరం చేసినా, నిజమైన స్నేహాన్ని చెరపలేదని ఈ కలయిక నిరూపించింది. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకున్న సహ విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ బెయిల్‌పై కొత్త అనుమానాలు

పరీక్షల పేరుతో బెయిల్ పొందడంపై ప్రశ్నలు..

టైమ్ టేబుల్‌లో అవకతవకల ఆరోపణలు

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

Subjects shown as backlog papers

| Sno | Subject | Date | Time | Remarks |
|---|---|---|---|---|
| 1 | Business Law | 23-Jun-26 | 11 AM – 1 PM | |
| 2 | Supply Chain Analytics | 23-Jun-26 | 2:30 PM – 4:30 PM | Same Date & Time? |
| 3 | Portfolio / Investment & Portfolio Management | 23-Jun-26 | 2:30 PM – 4:30 PM | Same Date & Time? |
| 4 | Leadership and Teamwork | 24-Jun-26 | 11 AM – 1 PM | Same Date & Time? |
| 5 | AI/ML Approaches to Decision Making | 24-Jun-26 | 11 AM – 1 PM | Same Date & Time? |
| 6 | Capstone Course | 24-Jun-26 | 2:30 PM – 4:30 PM | |
| 7 | Evidence Based Management | Subject shown in email | Timing as per schedule? | Not found in exam Schedule? |

| Event | Date |
|---|---|
| Offence dates mentioned | 25.10.2025, 13.11.2025, 31.12.2025, 01.01.2026 |
| Judicial remand | 16.05.2026 |
| Supplementary exams missed | 19.05.2026 – 30.05.2026 |
| University email regarding special supplementary exams | 15.06.2026 |
| Last date for supplementary fee | 18.06.2026 |
| Interim bail petition filed | 19.06.2026 |
| Exams begin | 22.06.2026 |

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌కు మధ్యంతర బెయిల్ మంజూరైన నేపథ్యంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీదీూ సప్లిమెంటరీ పరీక్షలు రాయాల్సి ఉందనే కారణంతో కోర్టును ఆశ్రయించి బెయిల్ పొందినట్లు సమాచారం. అయితే ఆయన తరపున సమర్పించిన పిటిషన్, పరీక్షల టైమ్ టేబుల్‌లో ఉన్న వివరాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**మూడేళ్ల తర్వాత సప్లిమెంటరీ పరీక్షలా..?**

పిటిషన్‌లో 2023 బ్యాచ్ దీదీూ సప్లిమెంటరీ పరీక్షలు రాయాల్సి ఉందని పేర్కొనడం పలు సందేహాలకు తావిస్తోంది. 2023లో ఫెయిల్ అయిన పరీక్షలను మూడేళ్ల తరువాత రాస్తున్నారా? 2024, 2025 సంవత్సరాల్లో నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షల్లో హాజరయ్యారా లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఒకే సమయానికి రెండు పరీక్షలపై అనుమానాలు**

కోర్టుకు సమర్పించిన టైమ్ టేబుల్‌లో ఒకే తేదీన, ఒకే సమయానికి రెండు సబ్జెక్టుల పరీక్షలు ఉన్నట్లు చూపించారని సమాచారం. సాధారణంగా ఒకే సమయంలో రెండు పరీక్షలు నిర్వహించడం సాధ్యం కాదని, ఇది పిటిషన్ విశ్వసనీయతపై అనుమానాలు పెంచుతోందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**రెండు నెలల్లో రెండు సార్లు సప్లిమెంటరీ పరీక్షలా?**

మే నెలలో జరగాల్సిన సప్లిమెంటరీ పరీక్షలు రాయలేకపోయానని, జూన్‌లో పరీక్షలు రాసేందుకు అవకాశం ఇవ్వాలని పిటిషన్‌లో కోరినట్లు తెలుస్తోంది. అయితే ఒకే విద్యాసంస్థ రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిందా? అనే అంశంపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**బాధితురాలికి సమాచారం ఇవ్వకపోవడంపై విమర్శలు**

చట్ట ప్రకారం బెయిల్ మంజూరు చేసే ప్రక్రియలో బాధితురాలు లేదా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, ఈ కేసులో అలాంటి సమాచారం అందలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది బాధిత కుటుంబంలో మరింత ఆందోళనకు కారణమైందని తెలుస్తోంది.

**న్యాయ నిపుణుల ప్రశ్నలు**

"పరీక్షలు భవిష్యత్తులో మళ్లీ రాయవచ్చు. కానీ నిందితుడు బయటకు వచ్చి బాధితురాలిని లేదా సాక్షులను ప్రభావితం చేస్తే పరిస్థితి ఏంటి?" అంటూ న్యాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. కేసు విచారణ కొనసాగుతున్న సమయంలో బెయిల్ మంజూరు అంశంపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

**బాధిత కుటుంబంలో ఆందోళన**

ఇప్పటికే తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్న బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు బెయిల్ విషయంపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై పూర్తి పారదర్శకతతో విచారణ జరగాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఫైనాన్స్ మోసం..?


చిట్టీల టోకరాతో తోటి ఉపాధ్యాయులకు కష్టాలు..?

ష్యూరిటీ పేరుతో లక్షల రూపాయల భారం మోపినట్లు ఆరోపణలు

కోర్టు నోటీసులతో ఆందోళనలో బాధితులు

'మీ దిక్కున్న కాడ చెప్పుకోండి' అంటూ బెదిరింపులా..?

జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టాలని బాధితుల డిమాండ్




**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, 21 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి మచ్చ తెచ్చేలా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై తీవ్ర ఆరోపణలు వెలువడుతున్నాయి. చిట్టీల పేరుతో తోటి ఉపాధ్యాయులను నమ్మించి, వారిని ష్యూరిటీలుగా నిలబెట్టి భారీ మొత్తంలో ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల సమాచారం ప్రకారం, సదరు ఉపాధ్యాయుడు చిట్‌ఫండ్లలో డబ్బులు తీసుకునే సమయంలో పలువురు సహోద్యోగులను సాక్షులు, ష్యూరిటీలుగా చేర్చినట్లు తెలుస్తోంది. అనంతరం చెల్లింపులు నిలిచిపోవడంతో చిట్‌ఫండ్ సంస్థలు కోర్టులను ఆశ్రయించగా, ష్యూరిటీలు ఇచ్చిన ఉపాధ్యాయులకు నోటీసులు అందినట్లు సమాచారం. తాము కేవలం నమ్మకంతో సంతకాలు చేసినప్పటికీ, ఇప్పుడు అప్పుల భారం తమపై పడిందని బాధితులు వాపోతున్నారు. కొందరి జీతాల నుంచి కోతలు పడుతున్నాయని, కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెబుతున్నారు. అంతేకాకుండా డబ్బుల విషయమై ప్రశ్నించిన వారికి సదరు ఉపాధ్యాయుడు అహంకార ధోరణితో సమాధానాలు ఇస్తున్నాడని, "నా జోలికి వస్తే బాగుండదు", "మీ దిక్కున్న కాడ చెప్పుకోండి" అంటూ హెచ్చరికలు చేస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు అడిగిన వారిపై ఒత్తిళ్లు, బెదిరింపులు, దాడుల ప్రయత్నాలు కూడా జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంతో కొందరు కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారని, ఒకరు గుండెపోటుతో ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం. దీంతో ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. సమాజానికి మార్గదర్శకులుగా ఉండాల్సిన ఉపాధ్యాయులు ఇలాంటి వివాదాల్లో చిక్కుకోవడం ఆందోళన కలిగించే అంశమని పలువురు అభిప్రాయపడుతున్నారు. బాధితులు జిల్లా విద్యాశాఖ అధికారులను ఆశ్రయించి పూర్తి స్థాయి విచారణ జరిపి, నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు, బాధితుల వాంగ్మూలాలు, కోర్టు నోటీసుల అసలు కథనం, ఆర్థిక లావాదేవీల వెనుక ఉన్న వాస్తవాలు, సంబంధిత అధికారుల స్పందన తదితర అంశాలతో ప్రత్యేక కథనం త్వరలో...

